ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి

● ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

ఉపాధికూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

దామరచర్ల, ఏప్రిల్ 19: ఉపాధి హామీ కూలీలకు పనుల చేసే ప్రాంతాల్లో వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ మూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలం లోని శాంతినగర్, నర్సాపూర్ గ్రామాల్లో చెరువు పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మస్టర్స్ రోల్‌కాల్ చేసి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తరేట్ల ప్రకారం రూ. 300 కొలతలను వారికి వివరించారు. కూలీలకు తాగునీరు, టెంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నాగేశ్వర్‌రావు, పీఎస్‌లు, టీఏలు మేట్లు పాల్గొన్నారు.

శివాలయం పుష్కర్‌ఘాట్ వద్ద దుర్వాసన

వ్యర్థాలతో నిండిన పైలాన్‌కాలనీలోని శివాలయం పుష్కర్‌ఘాట్

నందికొండ, ఏప్రిల్ 19 : నందికొండ పైలాన్‌కాలనీలోని శివాలయం పుష్కరఘాట్ వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసనను వెదజల్లుతున్నది. నిత్యం స్నానాలకు పోయే భక్తులు, స్థానికులు వ్యర్థాలు, దుర్వాసనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు అధికంగా ఉండంతో పుష్కరఘాట్‌కు వచ్చే భక్తులు ప్రమాదాలకు కూడ గురవుతున్నారు. స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించి పుష్కరఘాట్ లోని వ్యర్థాలను తొలగించాలని, పుష్కరఘాట్‌లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత

విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సోలార్ కంపెనీ మేనేజర్ ప్రదీప్

కట్టంగూర్, ఏప్రిల్ 19 : మండలంలోని కురుమర్తి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం సీఎస్ఆర్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోలార్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులతో పాటు పాఠశాలకు టేబుల్స్, టీవీ, వాటర్ ప్యూరీ ఫైర్‌తో పాటు ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రదీప్, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం బి.రమణా రావు, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, శేఖర్, అంగన్‌వాడీటీచర్ అనురాధ, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

రథోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేశ్‌గౌడ్

రామగిరి, ఏప్రిల్ 19 : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సీతారామచంద్రస్వామి శుక్రవారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జయరామయ్య రథోత్సవం ఎదుట హోమం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్ మంత్రోచ్చరణలతో ముందుకుసాగారు. సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి రామగిరి, ఎన్‌జీ కళాశాల, ఎన్టీఆర్ విగ్రహం, టీటీడీ కల్యాణ మండపం మీదుగా రామాలయానికి చేరుకుంది. రథాన్ని లాగేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శనలు, భజనలు శాస్త్రీయ నృత్యాలు, భజన విన్యాసాల మధ్య రథోత్సవం ఆద్యంతం భక్తి భావాన్ని నింపేలా జరిగింది. రథోత్సవంలో ఆలయ అర్చకులు సముద్రాల యాదగిరాచార్యులు, శఠగోపాలచార్యులు, రఘునం దనాచార్యులు, విశ్రాంతి ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, ప్రముఖులు పారెపల్లి శ్రీనివాస్, గుమ్ముల మోహన్‌రెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తుంగతుర్తి: 9182777638

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ సిటీ ఏప్రిల్ 9 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కనగల్, గుర్రంపోడు మండలాల అధికారులకు కనగల్ ఎంపీడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండలు అధికంగా రావడంతో పాటు వర్షాలు లేక నీటి ఎద్దటి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీరు సరిపోని పక్షంలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతామని తెలిపారు. ప్రతి రోజు అధికారులు గ్రామాలను సందర్శించి నీటి సమస్యలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ మురళి, కనగల్ ఎంపీడీఓ రామయ్య, గుర్రంపోడు ఎంపీడీఓ శైలజ, ఆర్‌డబ్ల్యూస్ డీఈ ముజీపుద్దీన్, ఏఈ షఫీ, ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం హరి ఉన్నారు.

అధికారులు గ్రామాలను సందర్శించాలి : డీఆర్‌డీఓ పీడీ నాగిరెడ్డి

కేతేపల్లి : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున అధికారులు రోజు గ్రామాలను సందర్శించి సమస్యను తెలుసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో శుక్రవారం కేతేపల్లి, శాలిగౌరారం మండల, గ్రామస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో తాగు నీటి పైప్‌లైన్లు, మోటర్లు మరమ్మతులు ఉంటే ఒక్క రోజులో పని పూర్తి తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఉపాధి హామీ కూలీలకు పనిదినాలకు సరిపడా పని కల్పిస్తూ రోజు వారీ కూలీ డబ్బులు రూ.300 అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవసరమైన యూనిఫారాలను జూన్ 12 లోపు సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, డీఎల్‌పీఓ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నాగిరెడ్డి

చలివేంద్రం ఏర్పాటు

మాల్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మాల్, ఏప్రిల్ 19:చింతపల్లి మండల పరిధిలోని గొడకొండ్లల గ్రామపంచాయతీలోని మాల్‌లో ఊరె జగన్, కృష్ణ చారిటబుల్ ట్రస్ట్, ఊరె యాదయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ సభ్యుడు, వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఊరె లక్ష్మణ్ చలివేంద్రం ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రం బాట సారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వడదెబ్బతో హమాలీ మృతి

కొండయ్య (ఫైల్)

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 19 : మండలంలోని చందనపల్లి గ్రామానికి చెందిన గన్నెపాక కొండయ్య (48) వడదెబ్బకు గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్న కొండయ్య మంగళవారం కొనుగోలు కేంద్రం లోనే అస్వస్థతకు గురయ్యాడు. దాంతో రెండ్రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే కొనుగోలు కేంద్రంలో సుమారుగా గ్రామానికి చెందిన హమాలీలు 40 మందికి పైగా ఇతర గ్రామాలకు చెందిన 12 మంది హమాలీలు పనిచేస్తున్నారు. ఈ కేంద్రంలో ప్రభుత్వం అందించిన టార్పలిన్లు నీడ కోసం వేయగా, టెంట్ మాత్రం ఏర్పాటు చేయలేదు. తాగు నీరు కూడా వేడిగా ఉంటున్నాయని రైతులు, హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ కేంద్రానికి ప్రారంభించిన నాటి నుంచి జిల్లా యంత్రాంగం మాత్రం పర్యవేక్షణ లేదని ఆరోపణ ఉన్నాయి. ఇప్పటికైన సౌకర్యలు మెరుగుపరిచి, మృతి చెందిన కొండయ్య కుటుంబానికి నష్టం పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉపయుక్తం 'చదువుల కళ'

● ప్రముఖ రచయిత, అధ్యాపకుడు డాక్టర్ బెల్లి యాదయ్య

రామగిరి, ఏప్రిల్ 19: ఉపాధ్యాయులకు, పాఠశాల విద్యతోపాటు కళాశాల విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయోగపడే వ్యాసాలతో 'చదువుల కళ' అనే పుస్తకం రచించినట్లు ప్రముఖ రచయిత, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే డీఈడీ, బీఈడీ, టెట్‌లో తెలుగు మెథడాలజీకి సంబంధించిన అంశాలను సహితం పుస్తకంలో సిలబస్ అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. పుస్తకం కావాల్సిన వారు 9848392690లో సంప్రదించాలని కోరారు.

ధాన్యం వివరాలు ట్యాబ్‌లో వెంటనే ఎంట్రీ చేయాలి : డీఎస్ఓ

నెల్లిబండ పీఏసీఎస్ సెంటర్‌లో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు

నకిరేకల్, ఏప్రిల్ 19 : కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం, బస్తా 40.650 మాత్రమే తూకం వేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలకేంద్రంలోని నెల్లిబండ పీఏసీఎస్ సెంటర్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీనియారిటీ ప్రకారం రైతుల ధాన్యం కాంటా వేయడం లేదని సెంటర్ ఇన్‌ఛార్జి సైదులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొనుగోలు చేసిన రైతు ధాన్యం వివరాలు వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, డీటీసీఎస్ జ్యోతి, సీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జి సైదులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకుడికి ఘన స్వాగతం

నీలగిరి,ఏప్రిల్ 19 : లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా జిల్లాకు నియమితులైన ఐఆర్ఎస్ అధికారి కల్యాణ్ కుమార్ దాస్ శుక్రవారం నల్లగొండకు రావడంతో జిల్లా యంత్రాంగం అయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా కలెక్టర్ దాసరి హరిచందన ఆయనకు కలెక్టరేట్‌లోని పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాల యంలో పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె గురువారం ప్రారంభమైన లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను, వివిధ రకాల ఫారాలు, డిపాజిట్ అంశాలపై వివరించారు. అంతకుముందు రిటర్నింగ్ అధికారి చాంబర్లో ఎన్నికల పరిశీలకులు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ ఆర్ఓ నటరాజ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవికుమార్, డీఆర్ఓ డి.రాజ్యలక్ష్మితో నామినేషన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. వివిధ రకాల ఫారాలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. వారి వెంట జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్ ఉన్నారు.

'సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంచుకోవాలి'

రామగిరి, ఏప్రిల్ 19. సైబర్ నేరాల నివారణపై యువత అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, హంట్ మెట్రిక్స్ సంయుక్తంగా ' సైబర్ నేరాలు –సవాళ్లు అంశం'పై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, హంట్ మెట్రిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ అయూబ్ షేక్ సోషల్ మీడియా దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా 10.5 ట్రిలియన్ డాలర్లు సైబర్ నేరాల కారణంగా నష్టపోతున్నట్లు, ఒక్క హైదరాబాద్ నగరంలోనే సుమారు 600 కోట్ల రూపాయల నష్టపోతున్నట్లు వివరించారు. ఉచితాలు ధరలు ముసుగులో నెరగాళ్లు వల విసిరే అవకాశం ఉందని తెలిపారు. నేడు అన్ని రంగాల్లో సైబర్ నేరాలకు అస్కారం ఉందని అందుకు సమర్థవంతంగా ఎదుర్కొనే మానవ వనరుల లేని స్పష్టంగా గోచరిస్తుందన్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు కళాశాలలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని స్వల్పకాలిక కోర్సులను తమ సంస్థ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రామచందర్, డాక్టర్ వై ప్రశాంతి, డాక్టర్ ప్రేమ్ సాగర్, ఆచార్య రేఖ డాక్టర్ మద్దిలేటి, డా.పండరయ్య, డాక్టర్ లక్ష్మీ మధు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, ఏప్రిల్ 19 : హాలియాలో శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఫీడర్–1లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బాలూ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియాలో ఫీడర్–1 పరిధిలోని రెడ్డి కాలనీ, అంగడిబజార్, సాయిప్రతాప్‌నగర్, వీరయ్యనగర్, అలాగే మిర్యాలగూడెం రోడ్డు, దేవరకొండ ప్రాంతాలతో పాటు కొత్తపల్లి, రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని రామడుగు, కుపాసిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సీతారామచంద్ర ఆంజనేయ స్వామి ఆలయంలో వ్రతాలు

మాల్, ఏప్రిల్ 19 : చింతపల్లి మండలం గొడకొండ్లలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జాతర సందర్భంగా శుక్రవారం సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. శ్రీ రామనవమి నుంచి నిర్వహిస్తున్న జాతర సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్, ఆంజనేయ స్వామి ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అంగిరెకులు గోపాల్ ఆధ్వర్యంలో అర్చకుడు వైద్యుల ప్రవీణ్ శర్మ వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో పోలేపల్లి నరేశ్, ఇడుకుండ్ల రాముతో పాటు భక్తులు పాల్గొన్నారు.

మే 26 నుంచి అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు

మిర్యాలగూడ, ఏప్రిల్ 19 : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మే 26 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ కోఆర్డినేటర్ ఎన్.కోటయ్య తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ మే 6వ తేదీ, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం ఫీజును టీఎస్ ఆన్‌లైన్‌సెంటర్ల ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుతో మాత్రమే చెల్లించాలని సూచించారు. వివరాలకు 7382929640 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక బృందాలు

● ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, ఏప్రిల్ 19: జిల్లాలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బృందాలు అన్ని ప్రాంతాల్లో నిఘా పెట్టి నియంత్రణ చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు ఇంటి పరిసరాలు, కాలనీల్లో, షాపుల్లో సీసీ టీవీ కెమెరాలు అమర్చుకావాలన్నారు. జైలు నుంచి విడుదల అయిన నిందితుల పైన JRMS (జైల్ రీలిజింగ్ మానిటరీ సిస్టమ్) ద్వారా ప్రతి నేర స్థుడి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరైన అనుమానిత వ్యక్తులు తమ పరిసరాల్లో కనిపిస్తే డయల్ 100 లేదా సంబంధిత పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేయాలని కోరారు.

21న హాలియాలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

హాలియాలో గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న యాదవ సంఘం నాయకులు

హాలియా, ఏప్రిల్ 19 : హాలియాలో ఈ నెల 21న స్వయంభూ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది. ఆలయ విగ్రహ ప్రతిష్ఠోపనోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయంలో గణపతి పూజ, స్వస్తివాచనం, కంకణదారణ,అఖండ దీపారాధన, అంకురార్ఘణ పూజ నిర్వహించారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఆదివారం యంత్రపూజ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, 21 రాత్రి 10గంటలకు గంపలు బయల్దేరి 22న అమ్మవారికి బోనాలు బలిహరణ ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రోత్ మానిటరింగ్‌పై అంగన్‌వాడీలకు అవగాహన

హాలియాలో అంగన్‌వాడి టీచర్లకు అవగాహన సదస్సు

హాలియా, ఏప్రిల్ 19 : మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతువేదికలో అనుముల, నిడమనూర్, పెద్దవూర, త్రిపురారం మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు సర్వే, గ్రోత్ మానిటరింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌హెచ్‌టీఎస్ సర్వేలో వచ్చిన మోదు కాని పేర్ల నమోదు గురించి అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించారు. మేలో వేసవి సెలవులు, ఎండకాలంలో చిన్నారులు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కార్యక్రమంలో సీడీపీఓ గంధం పద్మావతి, సూపర్‌వైజర్లు రమాదేవి, కమలాబాయి, వెంకాయమ్మ, గౌస్య, విజయలక్ష్మి, యాదమ్మ, రాజరాజేశ్వరి,సైదాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'లక్షే లక్ష్యం' ప్రారంభం

లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న డీఎం పాల్

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 19 : రాష్ట్రంలోని అన్ని డిపోలను లాభాల బాటలో పయనించేవి ధంగా ప్రస్తుతం ఉన్న ఆదాయం కంటే ప్రతి డిపో నుంచి రోజూ లక్ష రూపాయలు అదనంగా రాబట్టే విధంగా లక్షే లక్ష్యం కార్యక్రమాన్ని సంస్థ ప్రారంభించిందని అందుకు అనుగుణంగా సిబ్బంది ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధి కోసం కృషి చేయాలని మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం పాల్ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లక్ష్యం జెండా అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నష్టాల్లో ఉన్న ఆర్టీసీని వినూత్న పథకాలతో లాభాల బాటలో పయనింపజేస్తున్నారని పేర్కొన్నారు. ఈచాలెంజ్‌లో భాగంగా డిపో నుంచి అదనంగా ప్రతిరోజు అదనంగా లక్ష రూపాయలు రాబట్టే విధంగా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతినిత్యం డీఎం,సీఐ,ఎం.ఎఫ్‌ల సమక్షంలో గేట్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ భారతీబాయి, ఎంఎఫ్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

24న మధుమేహ నివారణకు ఉచితంగా మందు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న పండిట్ శ్రీనివాస్

మిర్యాలగూడ, ఏప్రిల్ 19 : ఈనెల 24న మధుమేహ వ్యాధి నివారణకు ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నట్లు బోధి ధర్మ ఆయుర్వేదిక్ వైద్య పీఠం వ్యవస్థాపకుడు పండిట్ శ్రీనివాస్ గురూజీ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయన కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. వీర రాఘవన్ వర్ధంతి రోజు ఉచిత ముందు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. మిర్యాలగూడలో బుధ, గురు, శుక్రవారం, హైదరాబాద్‌లో తన కార్యాలయంలో శని, ఆది, సోమవారాల్లో మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తన వైద్యానికి సహకారం అందించిన జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మున్నీర్ చేతుల మీదుగా ఈ మందు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదొద్దిన్, సిబ్బంది శివలింగం, రాము పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగకు రిమాండ్

● 20.30 తులాల ఆభరణాలు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నీలగిరి, ఏప్రిల్ 19 : అంతర్రాష్ట్ర దొంగను పట్టుకుని, అతడి వద్ద సుమారు రూ.16.24 లక్షల విలువైన 20.3 తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ వద్ద ఎస్ఐ రవికుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడకు చెందిన దేవరకొండ రాంబాబు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తేలినట్లు చెప్పారు. గతంలో రెండు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో చోరీ కేసుల్లో గుంటూరు పోలీసులు అరెస్ట్ చేయగా జైలు జీవితం గడిపి జనవరిలో బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా మిర్యాలగూడ పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలు, అంధ్రాలోని గుడివాడ, హనుమాన్ జంక్షన్‌ల్లో వరుసగా ఏడు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారాన్ని రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈకేసులో ప్రతిభ కనబర్చిన ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐ శివ, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీను, ఐటీ కోర్ మధులను ఆయన అభినందించారు.